## ప్రమాదాల నివారణకు స్మార్ట్ రోడ్ టెక్నాలజీ

### మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ప్రపంచమంతటా అనుసరిస్తున్న అధునాతన రోడ్డు నిర్మాణ పద్ధతులను తెలంగాణలోనూ అమలు చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. స్మార్ట్ రోడ్ టెక్నాలజీ, ఇంటెలిజెన్స్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ఫ్యూచరిస్టిక్ ఆటోమేటెడ్ కన్‌స్ట్రక్షన్, ఐసీటీ వంటి అధునాతన పద్ధతులను రోడ్ల నిర్మాణంలో వినియోగించి రోడ్డు మరణాలను తగ్గిస్తామని అన్నారు. సచివాలయంలో సోమవారం ప్రపంచబ్యాంకు ప్రతినిధులతో మంత్రి కోమటిరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో రోడ్ల అభివృద్ధికి ప్రపంచబ్యాంకు సహకారంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక అత్యంత ప్రమాదకరంగా ఉన్న హైవేలపై ట్రామాకేర్ సెంటర్స్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామని, ఇప్పటికే హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై ట్రామాకేర్ సెంటర్ నిర్మాణంలో ఉన్నదని తెలిపారు. ప్రపంచ బ్యాంక్ రవాణారంగ ప్రధాన అధికారి రీనూ అనుజా తమ బ్యాంక్ సహకారంతో అమలవుతున్న రోడ్డు నిర్మాణాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ఈఎన్సీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## గాంధీభవన్‌కు మంత్రులు

### కార్యకర్తల సాధకబాధకాలు వినేందుకు..

హైదరాబాద్, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ) : కార్యకర్తల సాధకబాధకాలు వినేందుకు ప్రతి బుధ, శుక్ర వారాల్లో వివిధ శాఖల మంత్రులు అందుబాటులో ఉండనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఈ మేరకు సోమవారం పీసీసీ అధ్యక్షుడు బొమ్మ గాని మహేశ్‌కుమార్‌గౌడ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 25న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, 27న పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అందుబాటులో ఉండనున్నట్టు తెలిపారు.

# పాల సేకరణ ధరలో కోత?

- లీటర్‌పై 5 తగ్గించే యోచనలో ప్రభుత్వం
- పాడి రైతులతో చైర్మన్ అమిత్ ప్రతిపాదన
- ప్రభుత్వ సమీక్షలోనూ ధర తగ్గింపుపై చర్చ
- ప్రైవేట్ డెయిరీల తరహాలో చెల్లించే ఆలోచన
- రైతులకు ఎక్కువ చెల్లించడం వల్లే నష్టాలట!
- భారం తగ్గాలంటే.. ధరలు దించాల్సిందేనట..
- రైతులను నిండా ముంచేందుకు ప్రభుత్వం కుట్రలు
- రైతుల మేలు కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధర పెంచితే.. నష్టాల పేరిట తగ్గిస్తున్న కాంగ్రెస్

**పాడి రైతుల నోట్లో సర్కార్ మట్టి!**

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : విజయ పాల రైతుల నోట్లో మట్టి కొట్టేందుకు సర్కార్ సిద్ధమవుతున్నదా? రైతులకు చెల్లించే ధరలో కోత పెట్టబోతున్నదా? ఎక్కువ ధర ఇవ్వడం వల్లే డెయిరీకి నష్టాలొస్తున్నాయనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నదా? ఈ ప్రశ్నలకు పాడి రైతులతో పాటు విజయ డెయిరీ వర్గాల్లోనూ 'అవును' అనే సమాధానాలే వినిపిస్తున్నాయి. లీటరు పాల ధరపై రూ.5 వరకు తగ్గించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నదని, త్వరలోనే అమలు చేయనున్నదని డెయిరీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు కొత్త చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, సీఎంవో అధికారుల మధ్య చర్చలు కూడా జరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నేపథ్యంలోనే సాధ్యమైనంత త్వరగా ధరలు తగ్గించి నష్టాలు పూడ్చుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.

**ధర తగ్గింపే పరిష్కారం.. మీరంతా సహకరించాలి**

విజయ డెయిరీ కొత్త చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డిని కలిసేందుకు వెళ్లిన పాడి రైతులకు ధర తగ్గింపుపై ఆయన పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్టు తెలిసింది. కొత్త చైర్మన్‌గా నియమితులు కావడంతో ఆయా జిల్లాల పాడి రైతు సంఘాల నేతలు ఆయనను మర్యాద పూర్వకంగా కలుస్తున్నారు. ఈ సందర్భంగా తమకు మూడు నెలలుగా రూ.150 కోట్ల వరకు పాల బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని చైర్మన్ దృష్టికి తీసుకెళ్తున్నారు. ప్రభుత్వంతో మాట్లాడి తమ బిల్లులు చెల్లించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలో చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ 'సమస్య పరిష్కారానికి ఏం చేద్దామో మీరే చెప్పండి' అంటూ రైతులను కోరినట్టు తెలిసింది. ప్రభుత్వంతో మాట్లాడితేనే పరిష్కారం లభిస్తుందని రైతులు చెప్పగా చైర్మన్ కల్పించుకొని 'ప్రైవేట్ డెయిరీలతో పోల్చితే విజయ డెయిరీలో రైతులకు చెల్లించే పాల ధర ఎక్కువగా ఉంది.. అందుకే నష్టాలు వస్తున్నాయి' అని వ్యాఖ్యానించినట్టు విశ్వసనీయ సమాచారం. నష్టాల నుంచి బయటపడాలంటే పాల ధర తగ్గించడమే ఏకైక మార్గమని స్పష్టం చేసినట్టు, ఇందుకు అన్ని జిల్లాల పాడి రైతు సంఘాలు సహకరించాలని కోరినట్టు తెలిసింది. కానీ, దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ధర తగ్గింపు ఆలోచన చేయవద్దని, కొత్త సమస్యలు సృష్టించొద్దని కోపానికి రాగా వారి ఆగ్రహాన్ని పసిగట్టిన చైర్మన్ ఆ విషయం పెద్దది కాకుండా జాగ్రత్త పడుతూ ప్రభుత్వంతో మాట్లాడి త్వరగా బిల్లులు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చి పంపినట్టు రైతు సంఘాల వాట్సాప్ గ్రూపుల్లో జోరుగా చర్చ జరుగుతున్నది.

**ఎక్కువ ధర చెల్లించడం వల్లే నష్టాలట?**

పాల బిల్లులు చెల్లించాలని ఓవైపు రాష్ట్ర వ్యాప్తంగా రైతులు రోడ్డెక్కుతున్నారు. వారికి మద్దతుగా 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు ప్రచురిస్తున్నది. ఈ నేపథ్యంలో సమస్యపై ప్రభుత్వం ఆరా తీసి డెయిరీ అధికారులు, చైర్మన్‌తో చర్చించినట్టు తెలిసింది. రైతులకు చెల్లించే పాల ధర ప్రైవేట్ డెయిరీలతో పోల్చితే విజయ డెయిరీలో ఎక్కువ ఉండడమే ఇందుకు కారణమని అధికారులు చెప్పగా అవసరమైతే ధర తగ్గించే ఆలోచన చేయాలని ఆదేశించినట్టు సమాచారం. ప్రస్తుతం 5శాతం వెన్న ఉన్న లీటరు బర్రె పాలకు రూ.40.05 ధర చెల్లిస్తున్నారు. వెన్నశాతం ఎంత పెరిగితే అంత ధర పెంచి ఇస్తున్నారు. ఆవు పాలలో 3 శాతం వెన్న ఉంటే లీటరుకు రూ. 40.25 చొప్పున ఇస్తున్నారు. కరీంనగర్ డెయిరీలో ఆవుపాలకు 3శాతం వెన్న ఉంటే రూ. 33.65, నాగార్జున డెయిరీలో రూ. 33.25 చెల్లిస్తున్నారు. విజయ డెయిరీలో రైతులకు ఎక్కువ ధర చెల్లించడం వల్ల నష్టాలు వస్తున్నట్టు చెప్తుండడం గమనార్హం.

**పెంచిన బీఆర్‌ఎస్.. తగ్గిస్తున్న కాంగ్రెస్**

రైతులకు ఎంత వీలైతే అంత మేలు చేయాలని తపించిన మాజీ సీఎం కేసీఆర్ ఇందుకు అనుగుణంగానే చర్యలు తీసుకున్నారు. నాడు నష్టాల్లో ఉన్న విజయ డెయిరీని ప్రక్షాళన చేసి లాభాల్లోకి తెచ్చారు. విజయ డెయిరీ బలోపేతం కావాలంటే రైతులు పాలు పోస్తేనే సాధ్యమవుతుందని, డెయిరీ బలోపేతమైతే రైతులను దోచుకునే ప్రైవేటు డెయిరీల ఆగడాలకు కళ్లెం పడుతుందని భావించి పాల ధరను పెంచారు. ప్రైవేట్ డెయిరీల కన్నా ఎక్కువ ధర కల్పించారు. దీంతో డెయిరీకి పాల సేకరణ పెరిగి అభివృద్ధి బాట పట్టింది. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో డెయిరీకి మళ్లీ కష్టాలు, నష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టకపోవడంతో అక్కడి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు విమర్శలున్నాయి. ముఖ్యంగా ఈ శాఖకు మంత్రి లేకపోవడం అతిపెద్ద సమస్యగా మారింది. మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ శాఖ వైపు కన్నెత్తి చూడడంలేదు. ఈ నేపథ్యంలో డెయిరీ మళ్లీ తిరోగమనంలోకి పయనించి రైతులకు బిల్లులు చెల్లించలేని దుస్థితికి దిగజారింది. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ పాల ధర ఎక్కువగా ఉండటం వల్లే నష్టాలు వస్తున్నాయని ప్రచారం చేస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధరలు తగ్గించే ఆలోచన చేస్తుండడంపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో పాలు పారపోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు

## సర్కారుపై పాడి రైతుల ఆగ్రహం

- రోడ్డుపై పాలు పోసి నిరసన
- ప్రభుత్వం పాల పైసలు చెల్లించాలని డిమాండ్

ఆదిలాబాద్, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ) : విజయ డెయిరీకి పాలను విక్రయిస్తున్న రైతులు తమకు రెండున్నర నెలలుగా బిల్లులు రావడం లేదంటూ సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో పాలను పారపోసి నిరసన చేపట్టారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విజయ డెయిరీ ఆధ్వర్యంలో మూడు వేల మంది రైతులు ఉండగా.. పాల కేంద్రాల ద్వారా రోజుకు ఆరు వేల లీటర్ల పాల సేకరణ జరుగుతున్నది. ఒక్కో లీటరుకు రూ.40 నుంచి రూ.60 వరకు రైతులకు ధర వస్తుంది. జిల్లా వ్యాప్తంగా ప్రతి 15 రోజులకు రూ.70 లక్షల బిల్లులను చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో పాల రైతులకు సంబంధించిన రెండున్నర నెలల బిల్లులు రూ.3.50 కోట్లు బకాయి ఉంది. రెండున్నర నెలలుగా డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ విజయ డెయిరీ నుంచి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడుతాయని, తాము ఏమీ చేయలేమని అధికారులు సమాధానం ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో క్రమంగా బిల్లులు వచ్చేవని, కాంగ్రెస్ ప్రభుత్వంలో 8 నెలలుగా బిల్లులు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 150 కోట్లకు 50కోట్లే!

- పాడి రైతులకు పెండింగ్ బిల్లుల విడుదల
- నేడు ఖాతాలో వేస్తామని ప్రభుత్వం ప్రకటన
- ఆందోళన చేయొద్దు : విజయ డెయిరీ ఎండీ
- 26న ధర్నాకు పిలుపునిచ్చిన పాడి రైతులు

హైదరాబాద్, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ) : తమను మభ్యపెట్టేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదంటూ పాడిరైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని సర్కారుపై పోరుకు దిగిన రైతులు ఈ నెల 26న ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో ధర్నాకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ధర్నాకు పోలీసులు కూడా అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ప్రభుత్వం జంకినట్టు కనిపిస్తున్నది. ధర్నాను తాత్కాలికంగా ఆపే ప్రయత్నాల్లో భాగంగా బకాయిలు విడుదల చేసింది. రూ. 50 కోట్ల బకాయిలు విడుదలైనట్టు డెయిరీ ఎండీ లక్ష్మి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మొత్తం మంగళవారం రైతుల ఖాతాల్లో జమవుతుందని వెల్లడించారు. ఇక రైతులెవరూ ఆందోళన చేయొద్దని, సంయమనం పాటించాలని కోరారు. మార్కెట్ ధర కన్నా ఎక్కువ రేటు చెల్లిస్తున్నామని, మిగిలిన బకాయిలను త్వరగా చెల్లిస్తామని హామీ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ప్రకటనపై పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను ధర్నా చేయకుండా అడ్డుకునేందుకు ఈ కుట్రలు చేస్తున్నారని మండిపడుతున్నారు. మొత్తం బకాయిలు రూ.150 కోట్లకు పైగా ఉంటే కేవలం రూ.50 కోట్లు విడుదల చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇది ముమ్మాటికీ తమను తప్పుదోవ పట్టించేందుకేనని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 50 కోట్లు విడుదల చేసినట్టు వచ్చిన ప్రకటనపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రకటనపై అధికారుల సంతకం లేదని చెప్తున్నారు. రూ.50 కోట్లను మంగళవారం చెల్లిస్తామన్న ప్రకారం చెల్లించాలని, లేకుంటే మోసపూరిత కుట్రగానే భావించాల్సిందేనని స్పష్టంచేస్తున్నారు.

# 'నాన్ పిటిషనర్ల'కు అవకాశం ఇస్తరా?

- నీట్ కౌన్సెలింగ్‌పై తేల్చని వైద్యారోగ్య శాఖ
- జీవో-33 బాధితుల ఎదురుచూపులు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : నీట్ యూజీ కౌన్సెలింగ్‌లో 'స్థానికత' వివాదానికి సంబంధించి ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. కోర్టును ఆశ్రయించినవారికి నీట్ యూజీ కౌన్సెలింగ్‌లో అవకాశం ఇస్తామని సుప్రీం కోర్టుకు ప్రభుత్వం తెలిపిన సంగతి తెలిసిందే. జీవో-33ను వ్యతిరేకిస్తూ 135 మంది అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారికి అవకాశం కల్పించాలని సుప్రీంకోర్టు సైతం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నాన్ పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవో-33తో ప్రభావితమయ్యే అభ్యర్థులు దాదాపు వెయ్యి మంది వరకు ఉంటారని వైద్య, ఆరోగ్య శాఖ అంచనా వేస్తున్నది. ఇందులో కేవలం 135 మంది మాత్రమే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మిగతా వారు వివిధ కారణాల వల్ల న్యాయస్థానాలను ఆశ్రయించలేకపోయారు. కొందరు పేదరికంతో, మరికొందరు సమాచారం లేక, ఇంకొందరు మార్గం తెలియక కోర్టును ఆశ్రయించలేదు. ఇప్పుడు వారంతా అయోమయంలో పడ్డారు. కేవలం పిటిషనర్లకే అవకాశం ఇస్తే దాదాపు 850 మంది అన్యాయానికి గురవుతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బాధితులందరికీ అవకాశమివ్వాలని కోరుతున్నారు. మరికొందరు తమకు కూడా అవకాశం ఇవ్వాలంటూ కోర్టు మెట్లెక్కేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు ఈ అంశంలో సుప్రీంకోర్టు గత శుక్రవారం తీర్పునిచ్చింది. నాలుగు రోజులు గడుస్తున్నా వైద్య, ఆరోగ్య శాఖ ఇప్పటివరకు ఈ నిర్ణయంపై సమీక్షించలేదు. పిటిషనర్లు, నాన్ పిటిషనర్ల అంశంపై చర్చించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కౌన్సెలింగ్ గడువు దగ్గరికి వస్తున్నా నిర్ణయం తీసుకోకపోవడంపై అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కనీసం ఇప్పటికైనా స్పందించి అందరికీ అవకాశం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

## అక్టోబర్‌లో 500 బోనస్

### డిఫాల్టర్ మిల్లర్లకు ధాన్యం ఇవ్వం : మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ): వానకాలం ధాన్యం కొనుగోళ్లను అక్టోబర్ మొదటివారం నుంచి ప్రారంభించనున్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో అడిషనల్ కలెక్టర్లు, సివిల్ సప్లై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ధాన్యం కొనుగోలుకు 7,139 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ సీజన్ నుంచే సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్టు తెలిపారు. డిఫాల్టర్ మిల్లర్లకు ధాన్యం ఇచ్చేది లేదని స్పష్టం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న గ్రూప్-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్. చిత్రంలో ఇతర అధికారులు

## 'టాస్'ను ఏర్పాటుచేయాలి

### సర్కారుకు గ్రూప్-1 ఆఫీసర్ల అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : కేరళ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ తరహాలో రాష్ట్రంలోనూ తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌ను(టాస్) ఏర్పాటు చేయాలని రాష్ట్ర గ్రూప్-1 అధికారుల అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రంలో ఐఏఎస్‌ల కొరత నేపథ్యంలో ప్రతిభావంతులైన గ్రూప్-1 అధికారులను కార్పొరేషన్ ఎండీలు, అదనపు కలెక్టర్లుగా నియమించాలని డిమాండ్ చేసింది. గ్రూప్-1 అధికారుల అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి హనుమంతునాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ ఏర్పాటుపై అధ్యయనానికి 2015లోనే ఆరుగురు ఐఏఎస్‌లతో కమిటీ వేశారని, ఈ కమిటీ ఇప్పటివరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించలేదన్నారు. తమ సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి విన్నవిస్తామన్నారు. సమావేశంలో అధికారులు వేణుమాధవ్‌రెడ్డి, సయ్యద్ యాసిస్ ఖురేషి, అలోక్‌కుమార్, అంజన్‌రావు, అజయ్, భవాని, శశిశ్రీ, పద్మజారాణి, వినయ్, సోమశేఖర్, నూతనకంటి వెంకట్, శరత్‌చంద్ర, శ్రీరామ్, వినోద్‌రెడ్డి, షబానా, మైత్రిప్రియ పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులు

- రేషన్ పంపిణీ, సంక్షేమ పథకాలన్నీ దీని ద్వారానే అమలు
- ప్రయోగాత్మకంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒక పట్టణం, ఒక గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పంపిణీ
- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రేషన్ పంపిణీతో పాటు ఆరోగ్య తదితర సంక్షేమ పథకాలన్నింటినీ ఒకే కార్డు ద్వారా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. అందుకోసం అన్ని కుటుంబాలకు డిజిటల్ కార్డులు ఇవ్వాలని యోచిస్తున్నది. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం తన నివాసంలో వైద్యారోగ్య, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజస్థాన్, హర్యానా, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఇప్పటికే ఇలాంటి కార్డులు ఇచ్చినందున వాటివల్ల కలుగుతున్న లాభనష్టాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. ప్రయోగాత్మకంగా తెలంగాణలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఒక పట్టణాన్ని, ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఫ్యామిలీ డిజిటల్ కార్డులను అందించేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులకు స్పష్టం చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఉండాలని, వాటితో లబ్ధిదారులు ఎక్కడైనా రేషన్, ఆరోగ్య సేవలు పొందేలా వీలుకల్పించాలని సూచించారు. దీర్ఘ కాలంలో వైద్యసేవలకు ఉపయోగపడేలా ఫ్యామిలీ డిజిటల్ కార్డులో ప్రతి కుటుంబ సభ్యుని హెల్త్ ప్రొఫైల్ ఉండాలని పేర్కొన్నారు. కుటుంబసభ్యుల వివరాల్లో మార్పులు, చేర్పుల కోసం ఈ కార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని తెలిపారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పర్యవేక్షణకు జిల్లాలవారీగా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనరసింహ, సీఎస్ శాంతికుమారి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, సంగీత సత్యనారాయణ, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చోంగ్తూ పాల్గొన్నారు.

# 'మహాలక్ష్మి' డబ్బు ఎప్పుడిస్తరు?

- ఆసరా పింఛన్ 4వేలకు ఎప్పుడు పెంచుతరు?
- ఆ హామీలను చూసే కాంగ్రెస్‌కు ఓట్లేసినం
- ఎమ్మెల్యే మందుల సామేల్‌ను నిలదీసిన మహిళలు

మోత్కూరు, సెప్టెంబర్ 23: కాంగ్రెస్ పార్టీకి చెందిన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ఊహించని షాక్ తగిలింది. మోత్కూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 31 మంది లబ్ధిదారులకు స్థానిక ఎంపీడీవో కార్యాయంలో సోమవారం ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ తొమ్మిది నెలల పాలన, నియోజకవర్గంలో తన పని తీరు ఎలా ఉన్నదని మహిళలను ప్రశ్నించారు. దీనికి మోత్కూరు పట్టణానికి చెందిన బీసు యాకమ్మతోపాటు పలువురు మహిళలు స్పందిస్తూ.. 'ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2,500, ఆసరా పింఛన్ రూ.4వేలు ఇస్తామంటేనే ఓట్లేసినం. ఇంకెప్పుడిస్తరు?' అని సూటిగా ప్రశ్నించారు. దీంతో కంగుతిన్న సామేల్ తమది కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమని, అన్నీ సమకూర్చుకొని హామీలన్నీ అమలు చేస్తామని చెప్పుకొచ్చారు. మోత్కూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించామని, మోత్కూరుకు మంజూరైన ఆర్టీసీ బస్సు డిపో పనులను ఐదారు నెలల్లో ప్రారంభిస్తామని తెలిపారు. మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ, ఐటీఐ కళాశాలలు, తిరుమలగిరిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కవితాలక్ష్మీనర్సింహారెడ్డి, వైస్‌చైర్మన్ వెంకటయ్య, ఎంపీడీఓ నిరంజన్ వలీ పాల్గొన్నారు.

మోత్కూరులో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

## హాస్టల్ మెస్‌చార్జీలను తక్షణమే పెంచాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు
- డీఎస్‌ఎస్ సంక్షేమ భవన్ ఎదుట మహాధర్నా

హైదరాబాద్, సెప్టెంబర్23(నమస్తే తెలంగాణ): సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు సంబంధించిన మెస్‌చార్జీలను ప్రభుత్వం తక్షణమే పెంచాలని, తద్వారా విద్యార్థులకు పోషకాహారం అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కేవీపీఎస్(కులవివక్ష పోరాట సమితి)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. మాసబ్‌ట్యాంక్‌లోని డీఎస్‌ఎస్ సంక్షేమ భవన్ కార్యాలయం ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టల్ విద్యార్థులు అనేక అరకొర వసతులతో, అదేవిధంగా పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సీఎం, మంత్రుల పిల్లలను ఇలా చదివిస్తారా? అంటూ నాడు ప్రతిపక్షనేతగా మాట్లాడిన నేటి సీఎం రేవంత్ ఇప్పుడు ఎందుకు మాట్లాడడంలేదని, వసతులను ఎందుకు మెరుగుపరచడం లేదని నిప్పులు చెరిగారు. విద్యార్థులకు ప్యాకెట్ మనీ రూ.2000 పెంచాలని, 173 హాస్టళ్లకు సంబంధించి అద్దెలు రూ.12కోట్లు బకాయి ఉందని, మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని అల్టిమేటం జారీ చేశారు. ధర్నాలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# స్పీకర్‌కు హైకోర్టు నోటీసు

మొదటిపేజీ తరువాయి...

వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస్‌రావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును కాలరాస్తూ పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై తక్షణమే అనర్హత వేటు వేయాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ (కిలారి ఆనంద్ పాల్) దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. కేఏ పాల్ వ్యక్తిగతంగా హాజరై వాదనలు వినిపిస్తూ, పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వాళ్లపై తక్షణమే అనర్హత వేటువేయాలని కోరారు. ఇదే అంశంపై గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల ప్రతిని ధర్మాసనానికి అందజేశారు. ప్రజలు మ్యానిఫెస్టోను చూసి ఓట్లు వేశారని, ఒక పార్టీలో గెలిచి మరోపార్టీలోకి వెళ్లడాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు.



Telangana State Legislative Assembly Nampally Hyderabad

Legislature Secretariat of the State of Telangana

The Election Commission of India

**వ్యాపారంగా మారిన ఫిరాయింపులు**

తెలుగు రాష్ట్రాల్లో పార్టీ ఫిరాయింపులకు పాల్పడటం ఒక వ్యాపారంగా మారిపోయిందని కేఏ పాల్ ధర్మాసనం ముందు పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయకపోతే ప్రజాతీర్పుకు అర్థం లేకుండాపోతుందన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు జీతభత్యాలు చెల్లించకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యాంపై విచారణ జరిగి తీర్పు వెలువడేవరకు ఫిరాయింపు ఎమ్మెల్యేలను శాసనసభలోకి ప్రవేశించకుండా స్పీకర్ కార్యాలయానికి ఆదేశాలు ఇవ్వాలని అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు చట్టసభలో ఓటింగ్‌లో పాల్గొనే అర్హత లేకుండా చేయాలని కూడా కోరారు. వాళ్ల వేతనాలను కూడా నిలుపుదల చేయాలన్నారు. ఇలాంటి మధ్యంతర ఉత్తర్వులను జారీ చేస్తేనే ఫిరాయింపుదారుల్లో భయం ఉంటుందని, మరొకరు పార్టీ ఫిరాయింపునకు ముందుకురారని సూచించారు. ఐదేండ్లు ముగిసే వరకు ఫిరాయింపునకు పాల్పడిన చట్టసభ సభ్యులపై చర్యలు తీసుకోకపోతే ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిరాయింపుదారుల్లో దానం నాగేందర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీ చేశారని చెప్పారు. దానం నాగేందర్ ఇతరులపై పార్టీ చర్యలు తీసుకునేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. 10 మంది ఎమ్మెల్యేలతోపాటు ఈసీ, ట్రిబ్యునల్‌లకు నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## గిరిజన వర్సిటీలో చేరింది ముగ్గురే

- రెండు కోర్సుల్లో 47 సీట్లు ఖాళీ
- 'సమక్క సారక్క' తొలిబ్యాచ్‌లో అడ్మిషన్లు అంతంతే
- అక్టోబర్ 3న స్పాట్ ద్వారా భర్తీకి షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): సమక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ వర్సిటీని ప్రారంభించిన తొలి ఏడాది కేవలం ముగ్గురంటే ముగ్గురు విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారు. ఈ వర్సిటీని ములుగు సమీపంలోని జకారంలో తాత్కాలిక క్యాంపస్‌లో నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ మెంటార్ యూనివర్సిటీగా సహకారాన్ని అందిస్తున్నది. నాలుగేండ్ల వ్యవధి గల రెండు ఆనర్స్ డిగ్రీకోర్సులను ప్రవేశపెట్టగా, ఆరుగురు కాంట్రాక్ట్ ఫ్యాకల్టీని నియమించారు. ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు కల్పిస్తున్నారు. ఇంటర్ పూర్తిచేసిన వారికి బీఏ(ఆనర్స్) ఇంగ్లిష్, బీఏ(ఆనర్స్) ఎకనామిక్స్ కోర్సులను ప్రవేశపెట్టారు. ఒక్కో కోర్సును 25 సీట్లతో అందుబాటులోకి తీసుకురాగా, కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ యూజీ ద్వారా సీట్లను భర్తీచేశారు. అయితే ఇంగ్లిష్‌లో ఒక్కరు, ఎకనామిక్స్‌లో ఇద్దరు మాత్రమే అడ్మిషన్లు పొందారు. 50 సీట్లకు 47 ఖాళీగా ఉన్నాయి. మిగులు సీట్లను భర్తీచేసేందుకు అధికారులు అక్టోబర్ 3న స్పాట్ అడ్మిషన్లకు షెడ్యూల్ విడుదల చేశారు. ఆశావాహులు ములుగుకు సమీపంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో అక్టోబర్ 3న నిర్వహించే స్పాట్‌కు హాజరుకావాలని అధికారులు సూచించారు.

## నోటరీ స్థలాల్లోని ఇండ్లకు విద్యుత్తు మీటర్లు

- నిబంధనలు సడలించిన విద్యుత్తుశాఖ
- గతంలో రిజిస్టర్డ్ స్థలాలు, నిర్మాణాలకే మీటర్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): నోటరీ స్థలాల్లోని నిర్మాణాలకు సైతం కరెంటు మీటర్లు ఇవ్వాలని విద్యుత్తు శాఖ నిర్ణయించింది. ఇప్పటి వరకు రిజిస్టర్డ్ స్థలాల్లోని నిర్మాణాలకు మాత్రమే విద్యుత్తుశాఖ అధికారులు కొత్త కనెక్షన్లు జారీ చేస్తున్నారు. నోటరీ స్థలాలు, నిర్మాణాలకు కొత్త కనెక్షన్లు ఇచ్చేవారు కాదు. ఇది బ్రోకర్ల పాలిట వరంగా మారింది. విద్యుత్తుశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది, బ్రోకర్లు కుమ్మక్కయ్యి వేలకు వేలు తీసుకుని అక్రమంగా కనెక్షన్లు జారీచేసేవారు. పట్టణాలు, ఇతర ప్రాంతాల్లోని వినియోగదారులు అనివార్య పరిస్థితుల్లో బ్రోకర్లను ఆశ్రయించాల్సి వచ్చేది. ఒక్కో కనెక్షన్‌కు బ్రోకర్లు రూ.పదివేలకుపైగా వసూలు చేసేవారు. ఇది అవినీతికి దారితీస్తున్నదని గుర్తించిన అధికారులు నోటరీ స్థలాల్లోని ఇండ్లకు సైతం విద్యుత్తు కనెక్షన్లు జారీ చేయాలని ఆదేశాలిచ్చారు. ఇప్పటికే దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) పరిధిలో నోటరీ స్థలాల్లోని ఇండ్లకు కొత్త విద్యుత్తు కనెక్షన్లు జారీచేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

## తప్పుడు సమాచారమిచ్చే అధికారులపై క్రిమినల్ చర్యలు

### ఘోష్ కమిషన్ కసరత్తు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణలో తప్పుడు సమాచారం ఇచ్చే అధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టడంతోపాటు వారికి పదోన్నతులు కల్పించవద్దని ప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు జస్టిస్ ఘోష్ కమిషన్ సిద్ధమవుతున్నది. ఈ కమిషన్ ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధమున్న పలువురు ఇంజినీర్లను ప్రశ్నించింది. తాజాగా మంగళవారం నుంచి శనివారం వరకు మరికొందరు ఇంజినీర్లు, అకౌంటెంట్లతోపాటు దాదాపు 40 మంది అధికారులను విచారించేందుకు నోటీసులను సిద్ధం చేస్తున్నది. తాము అడిగిన అన్ని డాక్యుమెంట్లను ఇవ్వాలని ప్రభుత్వాన్ని.. ప్లేస్మెంట్ రిజిస్టర్, మెజర్మెంట్ బుక్ ఇవ్వాలని ఇంజినీర్లను ఇప్పటికే ఆదేశించినట్టు తెలుస్తున్నది. మంగళవారం ఆరుగురు ఇంజనీర్లు హాజరకానున్నారు.